క్లుప్తంగా

ఉద్యానవన విస్తరణాధికారిగా రాజు


బాధ్యతలు స్వీకరిస్తున్న ముత్యం రాజు

కోదాడరూరల్ : కోదాడ క్లస్టర్ ఉద్యానవన విస్తరణాధికారిగా రంగు ముత్యం రాజు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కోదాడ, అనంతగిరి, చిలుకూరు మండలాల ఉద్యానవన రైతులకు ఆయన సేవలు అందించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యానవన శాఖ ద్వారా పండ్ల తోటలు, ఆయిల్‌పామ్, కూరగాయలు, పూల తోటల సాగుతో పాటు డ్రిప్ పరికరాలు కావాల్సిన రైతులకు ప్రభుత్వం సబ్సిడీలను అందజేస్తున్నట్లు తెలిపారు. మామిడి తోటల పునరుద్ధరణకు ఎకరానికి రూ.9600 అందజేస్తుందని, కావాల్సిన మామిడి రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉద్యానవన సాగు సూచనలకు 86390 87839 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

యాతవాకిళ్ల వాసికి డాక్టరేట్



గవర్నర్, ఇస్రో చైర్మన్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న నాగయ్య

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బైరు నాగయ్యకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. జానపద గేయాలలో సామాజిక జీవన చిత్రణ అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ గోనానాయక్ పర్యవేక్షణలో ఈయన పరిశోధన చేసి యూనివర్సిటీకి సమర్పించారు. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. గరిడేపల్లి మండలం కల్మలచెరువు జెడ్పీహెచ్‌ఎస్‌లో తెలుగు పండిట్‌గా బైరు నాగయ్య పనిచేస్తున్నాడు. ఈ సందర్భంగా ఆయనకు మండలంలోని పలువురు ప్రజాప్రతినిదులు, అధికారులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ప్రమోద్‌కుమార్‌కు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న ప్రమోద్‌కుమార్

గరిడేపల్లి : మండలంలోని కల్మలచెరువు గ్రామ పంచాయతీ అమరారపు సైదులు కుమారుడు ప్రమోద్‌కుమార్ డాక్టరేట్ పొందాడు. ఇంజనీరింగ్‌లో మిషన్ లెర్నింగ్‌పై ఆయన పరిశోధన చేసినందుకు గాను మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరి యంలో జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. కల్మలచెరువు గ్రామ పంచాయతీ స్వీపర్‌గా పనిచేస్తూ కుమారుడిని ఉన్నత చదువులు చదివించిన అమరారపు సైదులను ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రశంసించారు. కాగా, ప్రమోద్ ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

అతిథి అధ్యాపకురాలి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో భౌతికశాస్త్రం బోధించేందుకు అతిథి అధ్యాపకురాలి పోస్టుకు ఈ నెల 21 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సీహెచ్.వాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భౌతిక శాస్త్రంలో పీజీ, బీఈడీ పూర్తి చేసిన మహిళా అభ్యర్థులు అర్హులని, 21న డెమో క్లాస్ నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని విధుల్లోకి తీసుకోనున్నట్లు ఆమె తెలిపారు.

అర్హులందరికీ 'పీఎం కిసాన్' వర్తింపజేయాలి

చిలుకూరు : అర్హత కలిగిన ప్రతి రైతుకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని వర్తింపజేయాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు అలసకాని వెంకటయ్య కోరారు. మంగళవారం చిలుకూరులో ఆయన రైతులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2019లో పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం ప్రారంభించినప్పుడు నమోదు చేయించుకున్న రైతులకే పెట్టుబడి సాయం బ్యాంక్ ఖాతాల్లో జమ అవతోందని, ఆ తరువాత పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులకు పీఎం కిసాన్ సాయం అందడం లేదని తెలిపారు. అలాగే ప్రాథమిక సహకార సంఘాల్లో తీసుకున్న రుణాలకు వడ్డీ రాయితీలో కేంద్ర ప్రభుత్వం 3 శాతం నగదును రైతుల ఖాతాల్లో జమ చేయడం లేదని కేవలం 1 శాతం రాయితీనే ఇస్తుందని అన్నారు. 3 శాతం రాయితీ డబ్బులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా సరఫరా చేసి కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొడారు బాబు, రైతులు బెల్లకొండ నాగయ్య, చిలువేరు నర్సయ్య, గంగిరెడ్డి అశోక్, పోలేబోయిన రామకృష్ణ, నాశబోయిన రామయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాలగర్భంలోకి మున్సిపల్ భవనం

- ఏడు దశాబ్దాల చరిత్రకు సజీవ సాక్ష్యంగా భవనం
- ఇక్కడి నుంచి 12 మంది సర్పంచ్‌లు, ముగ్గురు చైర్‌పర్సన్ల పాలన
- త్వరలో కూల్చివేత పనులు
- రూ. 6 కోట్లతో నూతన భవన నిర్మాణం


పురపాలక సంఘ భవనం

కోదాడ : ఏడు దశాబ్దాలుగా కోదాడ పట్టణ అభివృద్ధితో పాటు సామాజిక, రాజకీయ కార్యాకలాపాలకు వేదికగా ఉన్న భవనం కొద్ది రోజుల్లో కనుమరుగు కానున్నది. కాకలుతీరిన రాజకీయ నాయకుల రాజకీయ జీవితాలకు ఇక్కడే పునాది పడింది. ఒక్కప్పటి పంచాయతీ కార్యాలయంగా ఉన్న ప్రస్తుత కోదాడ పురపాలక సంఘ భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆరు కోట్ల రూపాయల వ్యయంతో బహుళ అంతస్తులతో నిర్మిస్తున్న ఈ భవనానికి జనవరిలో శంకుస్థాపన చేశారు. తాజాగా పనులు మొదలు కావడంతో పాత భవనాన్ని కూల్చివేయనున్నారు. ఇప్పటికే మున్సిపాలిటీ కార్యాలయాన్ని నయానగర్‌లో ఉన్న అద్దె భవనంలోకి మార్చారు. రెండు రోజులుగా భవనంలోని కిటికీలను, తలుపులను తీసి భద్రపరుస్తున్నారు. రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో కూల్చివేస్తామని మున్సిపల్ డీఈ సాయిలక్ష్మి తెలిపారు. నూతన భవనం రెండు సంవత్సరాల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది.

12 మంది సర్పంచ్‌లు.. ముగ్గురు చైర్‌పర్సన్ల పాలన ఇక్కడి నుంచే..

కోదాడ పట్టణం గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో పరోక్ష పద్ధతిలో ఎన్నికలు జరిగేవి. మొదటి సర్పంచ్‌గా మర్ల పానకాలరావును ఎన్నుకున్నారు. ఆ తరువాత తమ్మర వెంకటేశ్వరరావు, గుడుగుంట్ల అప్పయ్య, గరిడేపల్లి స్వామి, అనంత రామయ్య సర్పంచ్‌లుగా పని చేశారు. 1982 ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. రెండు సంవత్సరాలకు ఆయన ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో అప్పటి ఉపసర్పంచ్ సుబ్బరామయ్య సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆయన తరువాత పి. సత్యబాబు, ఏర్నేని బాబు, వాడపల్లి వెంకటేశ్వర్లు, పారా సీతయ్య, ఏర్నేని కుసుమలు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. పారా సీతయ్య సర్పంచ్‌గా ఉన్న సమయంలో 2005లో పాత భవనానికి అనుబంధంగా కొత్త భవనాన్ని నిర్మించారు. దీన్నే ప్రస్తుతం కమిషనర్, చైర్‌పర్సన్‌తో పాటు పైఅంతస్తులో సమావేశ మందిరంగా ఉపయోగిస్తున్నారు.

2011లో మున్సిపాలిటీగా మార్పు..

ఉమ్మడి రాష్ట్రంలోనే మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న కోదాడ 2011లో మున్సిపాలిటీగా మారింది. 2014లో మున్సిపాలిటీకి జరిగిన ఎన్నికల్లో తొలిచైర్‌పర్సన్‌గా వంటిపులి అనిత ఎన్నికయ్యారు. 2019లో వనపర్తి శిరీష ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం శిరీషను అవిశ్వాస తీర్మానం పెట్టి దించడంతో చివరి సంవత్సరం సామినేని ప్రమీల చైర్‌పర్సన్‌గా ఎంపికయ్యారు. ఈ ముగ్గురు చైర్‌పర్సన్లు కూడా ప్రస్తుత భవనం నుంచే తమ పాలన కొనసాగించారు.

భక్తిశ్రద్ధలతో మహాలక్ష్మి హోమం


హోమంలో పాల్గొన్న భక్తులు

నేరేడుచర్ల : శ్రావణ మాసం సందర్భంగా నేరేడుచర్ల పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో మంగళవారం శ్రీమహాలక్ష్మి హోమాన్ని ఆలయ పూజారి బృందావనం తేజ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజయనేయస్వామికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, ఆలయ ధర్మకర్త రాచకొండ మాధవరావు, వెంకటరమణారెడ్డి, వెంకట్‌రెడ్డి, కృపాకర్, యడవల్లి వెంకట్‌రెడ్డి, జంగారావు, నాగమాధవరావు, పూర్ణచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, ఊెంకట్‌రెడ్డి, చిన లచ్చిరెడ్డి, సుబ్బారావు, దేవేందర్, శ్రీరామ్, సీతారాంరెడ్డి, రంగనాయకమ్మ, నాగవేణి, నర్సిరెడ్డి, అరుణ, పూలమ్మ, విశాలక్ష్మి, శోభ, అనసూర్య రమాదేవి తదితరులున్నారు.

స్వీపర్ పోస్ట్ తిరిగి ఇప్పించాలని కలెక్టర్‌కు వినతి

నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీలో స్వీపర్‌గా పని చేస్తున్న తనను అకారణంగా తొలగించారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపించి స్వీపర్ పోస్ట్ తిరిగి ఇప్పించాలని కోరుతూ మున్సిపల్ కార్మికురాలు నాగమణి మంగళవారం సూర్యాపేటలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ.. నేరేడుచర్లకు చెందిన తన తల్లి తుమ్మలపల్లి సులోచన గత 40 ఏళ్లుగా మున్సిపాలిటీలో స్వీపర్‌గా పని చేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిందని ఆ తరువాత తాను గత మూడేళ్లుగా స్వీపర్ ఉద్యోగం చేస్తున్నానని, తన కుటుంబ పరిస్థితి కారణంగా 2024 మే 4వ తేదీన మున్సిపల్ అధికారులకు సమాచారం అందించి సెలవు పెట్టానని తెలిపారు. నాలుగు నెలల తరువాత విధుల్లోకి వస్తే ఆఫీస్‌కు రావద్దని చెప్పారని, మున్సిపల్ కార్యాలయంలో కూడా తన పేరును తొలగించారని పేర్కొన్నారు. తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

ఎరువులు ఎమ్మార్పీకే విక్రయించాలి

- ఆర్డీఓ సూర్యనారాయణ


కోదాడరూరల్ : ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఆర్డీఓ, వ్యవసాయ అధికారులు

కోదాడరూరల్ : రైతులకు ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలని ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల స్టాక్, రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యూరియాను కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈపాస్ ద్వారా ఎరువుల విక్రయాలు జరపలన్నారు. ఆయన వెంట ఏడీఏ ప్రవాంతి, ఎంఏఓ రజిని ఉన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి : ఆర్డీఓ

మేళ్లచెరువు : చింతలపాలెం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను, పీఏసీఎస్ గోదామును ఆర్డీఓ శ్రీనివాసులు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూరియా నిల్వలు, విక్రయాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు నానో యూరియా వాడకం అలవాటు చేసుకోవాలని సూచించారు. రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు ఎంఆర్‌పీకే విక్రయించాలని ఎరువుల దుకాణాల నిర్వాహకులను ఆదేశించారు. రైతులు ఎరువులు కొన్నాక తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, వ్యవసాయాధికారి శశాంక్, పీఏసీఎస్ చైర్మన్ రంగాచారి, డీలర్లు ఉన్నారు.


మేళ్లచెరువు : పీఏసీఎస్ గోదాములో స్టాక్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

యూరియా అధిక ధరకు అమ్మితే చర్యలు

హుజూర్‌నగర్ : యూరియాను ఎంఆర్‌పీకే విక్రయించాలని ఎస్ఐ మోహన్‌బాబు, డీటీ కత్తుల నాగేందర్, ఏఈఓ ముస్తఫా అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాక్, రికార్డులను సరిపోల్చి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, ఎక్కువ రేటుకు అమ్మినా, యూరియా అడిగితే దానితోపాటు వేరే వాటిని కూడా కొనాలని రైతులను ఇబ్బంది పెట్టినా, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు అమ్మినా చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ గాలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

కోదాడ : పట్టణంలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోదాడ మండల ఫొటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షుడు పిల్లుట్ల వెంకట్ మాట్లాడుతూ.. ఫొటోగ్రాఫర్స్ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో మరికంటి లక్ష్మణ్, సాయి వంశీ, రాంబాబు, శ్యామల సైదులు, సలిగంటి మురళి, కృష్ణ, విష్ణు, సైదాచారి, సైదా, ఫసి, మార్ల శేఖర్‌రెడ్డి, నాగరాజు, నరసింహారావు, సురేష్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

వేయి మాటల సమూహం.. ఒక చిత్రం

హుజూర్‌నగర్ : వేయి మాటల సమూహం ఒక చిత్రం అని ఎస్ఐ మోహన్‌బాబు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని టౌన్ హాల్‌లో స్థానిక ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెమెరా సృష్టికర్త లూయిస్ మండే డాగురె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు ఎస్ఐని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో..

నేరేడుచర్ల : పట్టణంలో నేరేడుచర్ల మండల ఫొటోగ్రాఫర్స్ యూనియన్ కార్యాలయం ఎదుట మంగళవారం ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్‌నాయక్‌తో కలిసి యూనియన్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు మచ్చ రవి, గౌరవ అధ్యక్షుడు చందమళ్ల శ్రీరాములు, జిల్లా సలహాదారుడు శ్రీనివాసాచారి, మండల ప్రధాన కార్యదర్శి నర్సింహచారి, కార్యదర్శి సందీప్, ఉపాధ్యక్షుడు బెంజిమన్, సందీప్‌వర్మ, ఫొటోగ్రాఫర్లు వెంకటేశ్వర్లు, సైదులు, బాలస్వామి, గణేష్, రామకృష్ణ, సురేష్, మనోహర్, గౌస్, రవి, మధు, కిశోర్, నాగార్జున తదితరులు ఉన్నారు.


హుజూర్‌నగర్ : లూయిస్ డాగురె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఐ మోహన్‌బాబు


కోదాడ : లూయిస్ డాగురె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు


నేరేడుచర్లలో నివాళులర్పిస్తున్న ఎస్ఐ, ఫొటోగ్రాఫర్లు

మోతెలో..

మోతె : మండల కేంద్రంలో మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవానికి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితామహుడు లయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోషియేషన్ అధ్యక్షుడు వేముల కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కాంపాటి మురళీధర్, ఉపాధ్యక్షుడు అర్వపల్లి శేఖర్, గౌరవ సలహాదారుడు శీలం హన్మంతరావు, ఎలమంచి, ప్రసాద్, బ్రహ్మం పాల్గొన్నారు.

మట్టపల్లి ఆలయంలోకి ఊటనీరు

- మోటార్ల ద్వారా ఎప్పటికప్పుడు ఎత్తిపోత


రక్షణగోడ కింది భాగం నుంచి ఆలయంలోకి ఉబికి వస్తున్న ఊటనీరు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోంది. నాగార్జునసాగర్ నుంచి వదరనీరు వస్తుండడంతో కొద్దిరోజులుగా మట్టపల్లి వద్ద పులిచింతల బ్యాక్ వాటర్ లెవల్స్ పెరిగాయి. దీంతో మట్టపల్లి ఆలయంలోకి ఊటనీరు చేరుతోంది. ఆలయం చుట్టూ రక్షణ గోడ ఉన్నా ఊటనీరు చేరుతుండటంతో విద్యుత్‌మోటార్ల సహాయంతో ఎప్పటికప్పుడు తోడేస్తున్నారు. ఇటీవల నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో నీటిపారుదల అధికారులు ఆలయాన్ని, ఊటనీరు వచ్చే విధానాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. కాగా, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వం రక్షణ గోడ పటిష్ట పరిచేందుకు, ఆలయంలో అభివృద్ధి పనులకు ఇటీవల రూ.4కోట్లు మంజూరు చేసిందని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు.

నానో యూరియాపై అవగాహన

మునగాల : వ్యవసాయ రంగంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రైతులు నానో యూరియా ప్లస్ వాడకాన్ని అలవాటు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బుంగా రాజు కోరారు. మంగళవారం మునగాల మండల కేంద్రం, ఆకుపాములలోని ప్రాథమిక సహకార సంఘాల కార్యాలయాల్లో రైతులకు నానోయూరియా ప్లస్ వాడకంపై ఆయన అవగాహన కల్పించి మాట్లాడారు. నానో యూరియా 500 మి.లీ. బాటిల్ రూ.225లు ఉంటుందని, మండలంలోని అన్ని ఎరువుల దుకాణాలతో పాటు సహకార సంఘాల గోదాముల్లో లభిస్తుందన్నారు. నానో యూరియా పంట దిగుబడిని పెంచుతుందని, సంప్రదాయ యూరియా కంటే మేలైనదని, నేల, గాలి, నీటి కాలుష్యాన్ని తగ్గిస్తుందని, చీడపీడలు, తెగుళ్ల ఉధృతిని తగ్గిస్తుందని వివరించారు. పర్యావరణానికి నానో యూరియా అనుకూలమైందని, దీనిని నిల్వ చేయడం, రవాణా చేయడం సులభమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునగాల, ఆకుపాముల కోఆపరేటివ్ కార్యదర్శులు బసవయ్య, పోలంపల్లి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

హుజూర్‌నగర్ : విద్యార్థులు ఎంచుకున్న క్రీడా రంగంలో విశేష ప్రతిభ కనబరిచి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని హెచ్‌ఎం పీవీ రమణారావు ఆకాంక్షించారు. మంగళవారం హైదరాబాద్‌లోని హకీంపేట క్రీడా పాఠశాలలో నాలుగో తరగతికి ఎంపికైన శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు పంగా శ్యామ్‌కుమార్, కోలపూడి శ్రీమాన్‌ను అభినందించి మాట్లాడారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు పంగా నరసింహారావు, కోలపూడి శ్రీనాథ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎకరాకు రూ.20వేలు నష్టపరిహారం అందించాలి

మఠంపల్లి : మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఊరచెరువులు అలుగు పోసి వాగులు పొంగి వరదలు పారడంతో వందలాది ఎకరాల వరి పొలాలు కొట్టుకుపోయి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20వేలు పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండునాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వరద నష్టాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మాళోతు బాలునాయక్, నాయకులు జాల తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

రోడ్ల మరమ్మతులకు రూ.2.61 కోట్లు మంజూరు

నడిగూడెం : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారుల మరమ్మతులకు రూ.2.61 కోట్ల నిధులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ శాఖ ఏఈ లావణ్య మంగళవారం తెలిపారు. వీరాంజనేయనగర్ నుంచి వేణుగోపాలపురం, మునగాల మండలం జగన్నాథపురం, రేపాల వరకు 4.5 కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు పునర్నిర్మాణ పనుల కోసం రెండు కోట్లు, కరివిరాల ఆవాస గ్రామమైన వెంకట్రాంపురం క్రాస్ రోడ్డు నుంచి వెంకట్రాంపురం వరకు 1.5 కిలో మీటర్ల వరకు రూ.61 లక్షలు మంజూరైనట్లు ఆమె తెలిపారు. త్వరలోనే పనులు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని వినతి

గరిడేపల్లి : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు కోరారు. ఈమేరకు మంగళవారం గరిడేపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌ను సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దార్ కవితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండలంలో ఇంటి స్థలం లేని నిరుపేదలు చాలా మంది ఉన్నారని, వారందరికీ ప్రభుత్వం స్థలాలను కేటాయించి ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు పోకల ఆంజనేయులు, షేక్ నబిసాహెబ్, ఫీర్‌సాహెబ్, హిమాంబి, పేరంబి పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలం


చిలుకూరులో వికసించిన బ్రహ్మ కమలం

చిలుకూరు : చిలుకూరు మండల కేంద్రంలోని షేక్ సలీం ఇంట్లో బ్రహ్మ కమలం పుష్పం వికసించింది. ఏడాదికి ఒకసారి శ్రావణ మాసంలో తనఇంట్లో బ్రహ్మకమలం వికసిస్తుందని సలీం తెలిపారు.

పాఠశాలకు వాయిద్య పరికరాలు బహూకరణ


దాత వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

చిలుకూరు : మండలంలోని నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే బడిలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు యర్ర వెంకటేశ్వర్లు రూ.10 వేల విలువ గల వాయిద్య పరికరాలను మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుజ్జుల నరసింహారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా దాత వెంకటేశ్వర్లును హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్ సరితను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నడిగూడెం : నడిగూడెం తహసీల్దార్ వి.సరిత జిల్లా స్థాయి ఉత్తమ తహసీల్దార్‌గా స్వాతంత్ర్య దినోత్సవం రోజు రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం నడిగూడెంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నడిగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు భోనగిరి ఉపేందర్, నాయకులు బొల్లం శ్రీను, ఎండి.జలీల్, డాక్టర్.సైదులు, ఎండి.రఫీ, సుదీప్ పాల్గొన్నారు.

ఎస్ఐ మోహన్‌బాబుకు సత్కారం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ నూతన ఎస్ఐ మోహన్‌బాబును స్థానిక బులియన్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు యర్రంశెట్టి పిచ్చయ్య, సభ్యులు తంగెళ్లపల్లి పుల్లయ్యచారి, వాసా శ్రీనివాసరావు, తాడూరి అజయ్‌కుమర్, సుధాకరాచారి, రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

వినాయక చవితిని శాంతియుతంగా జరుపుకోవాలి



చిలుకూరు : సమావేశంలో మాట్లాడుతున్న కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి

చిలుకూరు: వినాయక చవితి పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి సూచించారు. సోమవారం చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో వినాయక చవితి ఉత్సవ కమిటీల సభ్యులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. వినాయక ఉత్సవ కమిటీల సభ్యులు మండపం ఏర్పాటు కోసం పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని సూచించారు. వినాయక నిమజ్జన వేడుకల్లో డీజేలకు అనుమతి లేదని తెలిపారు. నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు అనుమతులు తీసుకోవాలి

హుజూర్‌నగర్ : గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులు నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలని సీఐ చరమందరాజు తెలిపారు. మంగళవారం పట్టణంలోని టౌన్ హాల్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ శాఖ రూపొందించిన ప్రత్యేక పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. డీజేలకు అనుమతులు లేవన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మోహన్‌బాబు, ఆర్ఐ గాలి శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

టీఎల్‌ఎం మేళా


టీఎల్‌ఎం ఉపకరణాలను పరిశీలిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు శ్రీనివాస్, పద్మావతి

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి టీచర్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా నడిగూడెం, తెల్లబల్లి స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు శ్రీనివాస్, పద్మావతి మాట్లాడుతూ.. విద్యార్థులకు తక్కువ ఖర్చుతో తయారు చేసిన మెటీరియల్‌తో అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు నందిగామ రామారావు, రాజుల గురుస్వామి, బండారు గోవర్ధన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సురేష్, ఓంకారయ్య, నర్సిరెడ్డి, వెంకన్న, శ్రీధర్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్‌కు నివాళి


సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మోతె : మండల కేంద్రంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను శ్రీకంఠ మహేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌడజన హక్కుల పోరాట కమిటీ జిల్లా నాయకుడు బొడ్డు సాలయ్య, ఐతబోయిన వెంకన్న, బొడ్డు రామచంద్రు, రాపర్తి కాటమరాజు, వెలుగు వీరన్న, బొక్క లింగారెడ్డి, అంజి, వెగ్గిలం గోవిందయ్య, బుచ్చయ్య, పూర్ణాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి మొక్కలు పంపిణీ


రామాపురంలో మొక్కలు పంపిణీ చేస్తున్న గ్రామ పంచాయితీ సిబ్బంది

నడిగూడెం : వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా నడిగూడెం మండలంలోని రామాపురంలో మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆరె అశోక్‌వర్మ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలలో మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది నేలమర్రి వెంకటేశ్వర్లు, మందుల వెంకటేశ్వర్లు, గ్రామస్తులు గంధం గోవిందు, మారిశెట్టి నర్సింహారావు, ఏనుగుల యల్లేశ్వరరావు, ఈద వెంకటేశ్వరరెడ్డి, గరిడేపల్లి సీతారాములు, పోతురాజు లక్ష్మి, సామాజిక కార్యకర్త దున్నా నాగరాజు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

హుజూర్‌నగర్ : మండలంలోని బూరుగడ్డ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ ఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి దివ్యక్షేత్రంలో క్షేత్రపాలకుడు శ్రీఆంజనేయస్వామికి మంగళవారం 108 తమలపాకులచే ఆకుపూజ చేశారు. ఈ సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకం చేసి గంధ సిందూరం, పానకం, వడపప్పు, పండ్లు, నారికేళము, పులిహోర, వడమాల, ప్రసాద నివేదన గావించారు. స్వామివారికి పూలదండలతో అలంకరణ, నీరాజన మంత్రపుష్పం, అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ గావించారు. అనంతరం అన్నదానం చేశారు. నిర్వాహకులు, ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, ఆలయ ఈఓ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


పూజలో చైర్మన్, ధర్మకర్తలు, ఈఓ, భక్తులు